

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం

23 ఫిబ్రవరి 2026 పేజీలు : 08




- ప్రభుత్వం కరుణ చూపేనా !
- ఉద్యోగాలతో ఆదుకునేనా..
- ఆశ.. నిరాశల మధ్య ఊగి సలాట
- నిర్వేదంలో కండలేరు నిరుద్యోగులు
- నియామకాలకు నోచుకోని ఉద్యోగ ఖాళీలు
- ఏళ్ల తరబడి పడిగాపులతో ఎదురుచూపులు
- అధికారుల నిర్లక్ష్యపు ధోరణితో.. ప్రభుత్వానికి చెడ్డపేరు

## ఉద్యోగమా.. నష్టపరిహారమా !

**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :**

జలవనరుల శాఖలో అంతర్భాగమైన తెలుగు గంగ పరిధిలోని కండలేరు జలాశయం కింద ముంపుకు గురైన బాధిత నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేనా, లేక నష్టపరిహారం చెల్లించేనా.. అనే సందిగ్ధంలో బాధితులు కొట్టుమిట్టాడుతున్నారు. కండలేరు ముంపు బాధిత నిరుద్యోగులకు ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందన్న ఆశలు రోజురోజుకి సన్నగిల్లుతుండటంతో ఒకింత నిర్వేదంలో ఉన్నట్లు తెలుస్తుంది. కండలేరు రిజర్వాయర్ నిర్మాణ సమయంలో ప్రభుత్వం విడుదల చేసిన ఇంటికో ఉద్యోగం కల్పించే దిశగా సంబంధిత అధికారులు ఖాళీలను భర్తీ చేసే విషయంలో జరుగుతున్న జాప్యం.. అనుసరిస్తున్న నిర్లక్ష్య ధోరణి వల్ల ఇప్పటికే ఎందరో ముంపు బాధిత నిరుద్యోగులకు వయోపరిమితి దాటిపోవడంతో ఆశలు వదులుకున్నట్లు తెలుస్తోంది. కండలేరు ముంపు బాధిత నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ఇచ్చిన జీవోలను సంబంధిత సక్రమంగా అమలు చేయకుండా పొంతన లేని సమాధానాలతో కాలయాపన చేస్తుండడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్న బాధ్యత నిరుద్యోగులు భవిష్యత్తులో ఉద్యోగాలు రాకపోతే తమ జీవితాలు ఏమవుతాయోనన్న భావనతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కండలేరు రిజర్వాయర్ పరివాహక ప్రాంతాల్లో ముంపుకు గురైన గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగులు ప్రభుత్వ స్పందన కోసం కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు. ఇంటికో ఉద్యోగం కల్పించే విషయంలో ప్రభుత్వం కరుణ చూపకపోతే యువశక్తి బ్రతుకులు నిర్వీర్యమవుతాయనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. కండలేరు నిర్మాణ సమయంలో తమ గ్రామాలను స్వచ్ఛందంగా త్యాగం చేసిన ముంపు బాధితులను -మిగతా 2లో

### కల్యాణ మండపాన్ని ప్రారంభించిన

## ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :**

రుద్రకోట గ్రామంలో నూతనంగా నిర్మించిన మన్నెమేల రాఘవరెడ్డి కల్యాణ మండపాన్ని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఆదివారం ఈ మేరకు కావలి రూరల్ మండలం రుద్రకోటకు వెళ్లిన ఆయనకు స్థానిక నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి కల్యాణ మండపాన్ని ప్రారంభించారు. మండపంలో ఏర్పాటు చేసిన దేవతా మూర్తులకు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాంత ప్రజలకు ఒక చక్కని కల్యాణ మండపం అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో అన్నాతమ్ముళ్లు వెంకటరమణారెడ్డి, వెంకారెడ్డి దీన్ని నిర్మించారన్నారు. దీన్ని లాభాల కోసం అని కాకుండా తక్కువ ఖర్చుతో సామాన్యులకు కూడా అందించాలని కోరారు. కల్యాణ మండపం ఎన్నో మధుర జ్ఞాపకాలకు వేదిక కావాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో నెల్లూరు మేయర్ రూప్‌కుమార్ యాదవ్, టీడీపీ నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, గుడి హరి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వాల్టా చట్టానికి.. తూట్లు !

- ఇష్టారాజ్యంగా చెట్లు నరికివేత..
- చోద్యం చూస్తున్న అటవీ అధికారులు




**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :**

ఉదయగిరి అటవీ రేంజ్ పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా వేప, రావిలాంటి భారీ వృక్షాలు నరికి వోల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నా.. సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. వాల్టా చట్టం ప్రకారం ఇంట్లో పెంచుకున్న చెట్టు అయినా సరే, అటవీ శాఖ నుండి సమలిత అధికారుల నుంచి అనుమతి తప్పనిసరిగా పొందాలి. వ్యవసాయ పొలాల్లో కలప అయితే అటవీ అధికారులతో పాటు స్థానిక రెవెన్యూ అధికారుల డిక్లరేషన్ తప్పనిసరిగా ఉండాలి. ఐదు మొక్కలు నాటి ఐదు బతికిన తర్వాత భారీ వృక్షాన్ని కొట్టేయాలి. ఇవేమీ లేకుండా ఆదాయమే పరమావధిగా ఇష్టారాజ్యంగా చెట్లు నరికి వేస్తున్నా.. క్షేత్రస్థాయి అటవీ శాఖ సిబ్బంది మామూళ్ల మత్తులో జోగుతూ వారికి అండగా నిలబడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఎన్నడూ -మిగతా 2లో

## నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- ఇంటర్ పరీక్షలకు 81 పరీక్ష కేంద్రాలు
- హాజరు కానున్న 53,404 మంది విద్యార్థులు
- ఫ్లైయింగ్ స్క్వాడ్స్ 6, సిట్టింగ్ స్క్వాడ్స్ 13 మందితో పర్యవేక్షణ



**నెల్లూరు బ్యూరో, మేజర్‌న్యూస్ :**

నేటి నుండి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇంటర్మీడియట్ పరీక్షలు జిల్లాలో 81 పరీక్ష కేంద్రాల్లో జరుగనున్నాయి. ఈ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఫ్లైయింగ్ స్క్వాడ్స్, సిట్టింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేసినట్లు ఇంటర్ బోర్డు అధికారి ఆర్ఐఓ వరప్రసాద్ తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్షలు జిల్లాలో 81 కేంద్రాల్లో జరిగే ఈ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా మొత్తం 53,404 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాయనున్నారు. దీనిలో ఇంటర్ ప్రథమ సంవత్సరం 25,735 మంది జనరల్ విద్యార్థులు హాజరువుతుండగా, ఒకేషనల్ విద్యార్థులు 1200 మంది ఉన్నారు. అలాగే ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 23,334 మంది కాగా ఒకేషనల్ విద్యార్థులు 1135 మంది ఈ పరీక్షలకు హాజరు కానున్నారు. పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని -మిగతా 2లో

## వినియోగదారులే కేంద్రంగా..

# నాణ్యమైన విద్యుత్ సేవలు

- స్మార్ట్ మీటర్లు, సోలార్ విద్యుత్ అమలులో ఉద్యోగులే ముందుండాలి
- ఏప్రిల్ 1లోపు విద్యుత్ ఉద్యోగులకు స్మార్ట్ మీటర్, సోలార్ ఏర్పాటు
- ఎస్సీ ,ఎస్టీ వినియోగదారులకు సూర్య ఘర్ కింద ఉచిత సోలార్ కనెక్షన్లు
- యుద్ధప్రాతిపదికన అమలు..
- అంతరాయాలు తగ్గించడమే లక్ష్యం.. ముందస్తు నిర్వహణ తప్పనిసరి
- ఆర్డిఎస్ఎస్ పనులు వేగవంతం
- ప్రతి గ్రామానికి త్రీ-ఫేస్ విద్యుత్ సరఫరా లక్ష్యం
- ట్రాన్స్‌ఫార్మర్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి
- ప్రమాదాలకు తావులేకుండా భద్రతా చర్యలు
- ఏపీ ఎస్పీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ కె.గురవయ్య



**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** స్థానిక దర్గామిట్ట వద్దనున్న విద్యుత్ భవన్ సర్కిల్ కార్యాలయంలో ఏపీ ఎస్పీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్అండ్ హెచ్ఆర్డి కె.గురవయ్య అధ్యక్షతన కావలి విద్యుత్ ఆపరేషన్ డివిజన్ అధికారులతో ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ గురవయ్య మాట్లాడుతూ.. వినియోగదారుల సౌకర్యార్థం ఏపీ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీ ఎస్పీడీసీఎల్) అనేక వినూత్న కార్యక్రమాలను చేపడుతుందని తెలిపారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో, క్షేత్రస్థాయిలో మరింత దగ్గరగా పని చేయాలని.. చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి మార్గదర్శకత్వంలో ఈ కార్యక్రమాలు ప్రారంభించబడినట్లు వివరించారు. వినియోగదారుల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు 'డయల్ యువర్ సిఎండి' కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని, అలాగే క్షేత్ర స్థాయిలో వినియోగదారుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు 'కరెంటోళ్ళ జనబాట' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. పారిశ్రామిక వినియోగదారుల కోసం ప్రతి నెల మొదటి బుధవారం జిల్లాలలో, 3వ బుధవారం కార్పొరేట్ కార్యాలయంలో పారిశ్రామిక వినియోగదారుల సదస్సు నిర్వహిస్తూ, సమస్యలను నేరుగా వినేందుకు అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. అలాగే కొత్తగా సోలార్ వినియోగదారులు ఏవైనా సమస్యలు ఎదురైతే టోల్ ఫ్రీ నెంబర్ 1912కు కాల్ చేయవచ్చని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాలన్నీ ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలవుతున్నాయని తెలిపారు. విద్యుత్ శాఖకు చెందిన ఉద్యోగులు తప్పనిసరిగా ఏప్రిల్ 1లోపు స్మార్ట్ మీటర్ ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. అలాగే, ఉద్యోగస్థులందరూ ఏప్రిల్ 1లోపు సోలార్ విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. స్మార్ట్ మీటర్లను ముందుగా మన విద్యుత్ శాఖ ఉద్యోగులే ఏర్పాటు చేసుకొని, ప్రజలకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. దీనివల్ల స్మార్ట్ మీటర్లపై ఉన్న అనవసర అపోహాలు తొలగిపోతాయని, వినియోగదారుల్లో నమ్మకం పెరుగుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు "సూర్య ఘర్" పథకం కింద ఉచిత సోలార్ కనెక్షన్లు ఏర్పాటు చేయడం యుద్ధప్రాతిపదికన కొనసాగుతోందని తెలిపారు. ఈ పథకం ద్వారా అర్హులైన వినియోగదారులు పూర్తిస్థాయిలో లబ్ధి పొందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. స్మార్ట్ మీటర్ల వల్ల వినియోగదారులకు ఎటువంటి నష్టం ఉండదని, స్మార్ట్ మీటర్లపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. కన్‌స్ట్రక్షన్ విభాగం ద్వారా జిల్లాలో స్మార్ట్ మీటర్లపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. స్మార్ట్ మీటర్లపై సందేహాలున్న వినియోగదారులకు చెక్ మీటర్లు ఏర్పాటు చేసి సందేహాలు నివృత్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఆర్‌డిఎస్ఎస్ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని, ప్రతి గ్రామానికి త్రీఫేస్ విద్యుత్ అందించాలనే లక్ష్యంతో ఆర్‌డిఎస్ఎస్ పనులు జరుగుతున్నాయని, ఫేజ్-2 పనులు కూడా ప్రారంభమై వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. విద్యుత్ అంతరాయాలు రాకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎక్కడైనా వోల్టేజ్ సమస్యలు ఉంటే వెంటనే గుర్తించి అదనపు ట్రాన్స్‌ఫార్మర్లకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. అడిషనల్ లోడ్లను గుర్తించాలని, విద్యుత్ చౌర్యం జరుగుతున్న చోట్ల తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. 33 కేవీ, 11 కేవీ లైన్లను నిరంతరం పెట్రోలింగ్ చేయాలని, చెట్ల కొమ్మలు లైన్లకు తగులుతున్న చోట్ల వెంటనే తొలగించాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, కార్మికులు పని చేసే సమయంలో అన్ని భద్రతా చర్యలు పాటించాలని, ఎల్‌సి లు తీసుకున్నప్పుడు పనులు ప్రారంభించే ముందు తప్పనిసరిగా మరోసారి తనిఖీ చేయాలని సూచించారు. క్రమబద్ధంగా ప్రెవేంటివ్ మైంటెనెన్సు ఇన్స్పెక్షన్ నిర్వహించాలని ఆదేశించారు. అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ హెడ్‌క్వార్టర్స్‌లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పర్యవేక్షక ఇంజనీరు కె.రాఘవేంద్రం, కావలి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కెఎస్ బెనర్జీ, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రవిచంద్ర, రవికుమార్, ఏఏఓ రామాంజనేయులు, కావలి డివిజన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నిరుపయోగంగా మారిన డంపింగ్ యార్డ్

### అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా !



**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని 24 పంచాయితీలో డంపింగ్ యార్డ్‌లను తెలుగుదేశం ప్రభుత్వం హయంలో నిర్మించారు. డంపింగ్ యార్డ్‌లోకి సేకరించిన చెత్తను సేంద్రియ ఎరువులుగా తయారు చేసుకునే వెసులుబాటు ఉంది. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో వీటిని ఏమాత్రం ఉపయోగించుకోకుండా నిరుపయోగంగా పెట్టారు. డంపింగ్ యార్డ్‌లో అసాంఘిక కార్యకలాపాలు కొనసాగుతున్నట్లు సమాచారం. గ్రామ పంచాయితీలో స్వచ్ఛ భారత్ కింద గతంలో చెత్తను సేకరించి సంపదను సృష్టించే విధంగా వీటిని నిర్మించారు. అయితే గత ప్రభుత్వం అలంకారప్రాయంగా ఉంచారు. ప్రతి గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డులో తడి పొడి చెత్తలను వేరువేరుగా చేసి సేంద్రీయ ఎరువుగా తయారు చేసేవారు. వీటిని నిర్మించటానికి లక్షలు వెచ్చించి కట్టించారు. అలా ప్రజాధనాన్ని నిరుపయోగంగా ఉంచకుండా ప్రజలకు అవసరమయ్యే విధంగా వాటిని ఉపయోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాలలోని ప్రజలు కోరుతున్నారు. ఇది ఉపయోగంలో కొస్తే ఆయా గ్రామాల్లో ముగ్గురికి ఉపాధి దొరుకుతుందని తెలుపుతున్నారు. అంతేకాకుండా డంపింగ్ యార్డ్‌లో తయారు చేసిన ఎరువును రైతులు తమ పొలాలకు తీసుకువెళ్లే వెసులుబాటు ఉంటుందని ప్రజలు తెలుపుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వీటిపై దృష్టి సారించి ఉపయోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## నేటి నుంచి ఇంటర్ పరీక్షలు





*(మొదటి పేజీ తరువాయి)*

వరప్రసాద్‌రావు తెలిపారు. ఆదివారం స్థానిక ఆర్ఐఓ కార్యాలయంలో సిట్టింగ్, ఫ్లైయింగ్ స్క్వాడ్‌లతో సమావేశం నిర్వహించారు. ఆర్ఐఓ, డీవీఈఓ ఇతర డీఈసీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ సమా వేశంలో పరీక్షల ఏర్పాట్లు, నిర్వహణ గురించి చర్చించారు. పరీక్షలకు హాజరవు తున్న విద్యార్థులకు ఎలాంటి ఆటంకం లేకుండా ప్రశాంతంగా పరీక్షలు జరపాలని సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చారు.

## వాల్టా చట్టానికి తూట్లు

*(మొదటి పేజీ తరువాయి)*

లేనివిధంగా ప్రతినిత్యం పదుల సంఖ్యలో లారీలతో కలప తరలిపోతూ ఉంది. కళ్ళ ముందు లారీలు కలపను మోసుకువెళుతున్న ప్పటికీ కనీసం అటవీశాఖ అధికారులు ప్రశ్నించే చొరవ కూడా చూపడం లేదంటే మామూళ్లు తీసుకుంటున్నారన్న బహిరంగ చర్చలు వినపడుతున్నాయి. ఇటీవల ప్రపంచ పర్యావరణ సంస్థ ఇచ్చిన నివేదిక ప్రకారం భారతదేశంలో సగటు ఒక మనిషికి ఎనిమిది చెట్లు మాత్రమే మిగిలి ఉన్నాయని తేల్చి చెప్పింది. మానవాళి విపత్తుకు లోనవుతుందని తెలిసినప్పటికీ.. ప్రకృతి సంపదను కాపాడవలసిన అధికార యంత్రాంగం ప్రలోబాలకు లోబడి ప్రకృతి విధ్వంసానికి సహకరిస్తున్నారంటూ స్థానికంగా ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తరలిపోయే కర్రకు సంబంధించి ఎక్కడ అనుమతులు తీసుకున్నారు.. ఎక్కడ నరుకుతున్నారు.. ఎవరు ఎవరెవరికి చలానాలు వేశారు.. అని వివరాలు ఏమాత్రం తెలియడం లేదని పలువురు అంటున్నారు. కలప తరలింపు విషయంపై అందుబాటులో ఉన్న బీట్ అధికారులను వివరణ కోరితే.. తాము చలానా రాశామని, పంపిస్తున్నామని చెప్తున్నారని, చలానాలు రాస్తే ప్రకృతి యుద్ధం ఆగిపోతుందా.. అంటూ ప్రజల ప్రశ్నిస్తున్నారు. ఈతంగంపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని, అసలు వోల్టా చట్టం అమలులో ఉందా.. లేదా.. తెలియాల్సిన అవసరం కూడా ప్రజలకు ఉందని ఈ ప్రాంత ప్రజల కోరుతున్నారు.

## ఉద్యోగమా.. నష్టపరిహారమా !

*(మొదటి పేజీ తరువాయి)*

ఆదుకోవడంలో ప్రభుత్వాలు వివక్ష చూపుతుండడం పట్ల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కండలేరు ఆనకట్ట నిర్మాణ సమయంలో ఇల్లు.. వాకిలి.. భూములు సర్వం త్యాగం చేసిన గ్రామీణులు అప్పట్లో 'దేవుళ్ల లాగా' కనిపించారని, ప్రభుత్వ జీవో ప్రకారం ఇంటికో ఉద్యోగం, లేదా నష్టపరిహారం ఇవ్వాలని కోరిన ముంపు బాధితులు నేడు 'దయ్యాలు. భూతాలు'లాగా కనిపిస్తున్నారని పలువురు బాధిత కుటుంబాల అవార్డుదారులు ఎద్దేవా చేస్తున్నారు. కండలేరు పరిధిలో ఉన్న దాచూరు, నెల్లేపల్లి, కొలపనాయుడు పల్లి, నెర్నూరు తదితర గ్రామాలకు చెందిన 607 మంది అవార్డుదారులు తెలుగుగంగ ప్రాజెక్టు అధికారుల నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తూ ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించినప్పటికీ.. సంబంధిత అధికారులు మాత్రం కోర్టులకు కనీసం జవాబు కూడా ఇవ్వకుండా బాధ్యతారహితంగా వ్యవహరిస్తుండడం నిర్లక్ష్య ధోరణికి అద్దం పడుతున్నట్లు తెలుస్తుంది. ముంపు బాధితులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే విషయంలో అధికారుల అనుసరిస్తున్న అలసత్వం.. బాధ్యతారహిత్యమైన పనితీరు వంటి వరుస వైఫల్యాలు కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేవిధంగా ఉన్నాయనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. 1854 నాటి బ్రిటిష్ ప్రభుత్వ హయాం నుంచి పారుదల రంగాన్ని సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు నియమించబడిన లష్కర్లు, మ్యాన్ మజ్దూర్లు, గేట్ ఆపరేటర్లు, ఓవర్ సీర్స్ లాంటి స్థాయిలు కలిగిన శాశ్వత ఉద్యోగాలు 2010 వరకు ఉండేవి. ఈ క్రమంలో ఆయా స్థాయిలకు చెందిన పలువురు ఉద్యోగులు కాలపరిమితి ముగిసి పదవీవిరమణ చేసిన తర్వాత జిల్లాలో 800 పైచిలుకు ఖాళీగా ఉన్న ఉద్యోగాలు ఇప్పటికీ భర్తీకి నోచుకోకపోవడం గమనార్హం. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ చూపి కందలేరు ముంపు గ్రామాల నిరుద్యోగులకు ఉద్యోగవకాశాలు కల్పించి.. సాగు, తాగు అవసరాలను తీర్చే కల్పతరువు లాంటి కండలేరు రిజర్వాయర్ నిర్మాణ సమయంలో సర్వం త్యాగం చేసిన ముంపు గ్రామాల ప్రజల రుణం తీర్చు కునే దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లావాసులు కోరుతున్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

- మరణ శాసనం రాస్తున్న టిప్పర్లు, లారీలు
- అధిక వేగం అత్యంత ఎక్కువ రాపూర్ సమీపం లోని పులుగులపాడు క్రషర్ వద్ద నుండి గూడూరు కృష్ణపట్నం పోర్టు వైపు వందల సంఖ్యలో టిప్పర్లు
- టిప్పర్‌ని ఆపి సుమారు 20 నిమిషాలకు పైగా బేర సారాలు ఆడిన వ్యక్తులు ఎవరు వారి తెల్ల బొలోరా వాహనం ప్రమాదం జరగడం అనంతరం ఎందుకు పారిపోయారు
- బొలోరా ప్రభుత్వ వాహనమా ఇటీవల టోల్ వసూలు చేస్తున్న ఏఎన్ఆర్ సంస్థ వాహనమా?

**సైదాపురం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా సైదాపురం మండల కేంద్రంలోని జగనన్న లేఅవుట్ సమీపంలో శనివారం రాత్రి 7గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చాగణం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఈ ప్రమాదానికి ప్రధాన కారణం స్కూటీలో అతివేగంగా వెళ్లడం ఓ కారణం అయితే రోడ్డుపై టిప్పర్ ఆపి ఉండడం మరో ప్రధానా కారణంగా కనిపిస్తుంది ప్రమాదం జరగడానికి సుమారు 20నిమిషాల ముందు లారీను ఓ తెల్ల బొలెరో వాహనం వెంబడించి జగనన్న లే అవుట్ వద్ద ఆపి టిప్పర్కి సంబంధించిన డాక్యుమెంట్లు చూస్తూ ఎవరితోనో ఫోన్లో మాట్లాడుతూ.. దాదాపు 20 నిమిషాలకు పైగా రోడ్డుపైనే చర్చలతో గడిపేశారు అదే సమయంలో చాగణం నుండి సైదాపురం వైపు అతివేగంగా స్కూటీలో హెల్మెట్ లేకుండా వెళ్తూ కొద్దిగా చీకటి పడిన సమయంలో జగనన్న లే అవుట్ వద్ద లారీ ఆగి ఉందన్న విషయం గుర్తించలేకపోవడంతో ఒక్కసారిగా అదుపుతప్పి టిప్పర్ ను ఢీకొట్టడంతో ఘటన స్థలంలోనే స్కూటీ నడుపుతున్న తోటకూర సంతోష్‌కు తలకు బలమైన గాయాలు తగిలి మొహం చీద్రం అయ్యి ప్రాణాలు విడవగా, బంకాపురి శశి తలకు కూడా తీవ్ర గాయాలు కావడంతో ప్రాణం కుట్టుకుంటూ ఉండటంతో అటువైపు వెళుతున్నటువంటి వాహనదారులు ఘటన స్థలాన్ని గమనించి 108 అంబులెన్స్‌కు ఫోన్ చేయగా తక్షణమే స్పందించిన 108 సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను గూడూరు ఏరియా హాస్పిటల్కు తరలించే మార్గమధ్యంలో కొనఊపిరితో కొట్టిమిట్ ఆడుతున్న శశి మరణించాడు. అయితే హెల్మెట్ ధరించి ఉంటే తలకు రక్షణగా ఉండి ప్రాణాలు ఉండే అవకాశం ఉండేది ఏమో తలల పగిలి భారీగా రక్తస్రావం జరగడం హెడ్ ఇంజిరి మరణానికి ప్రధాన కారణంగా తెలుస్తుంది. ఈ సంఘటన స్థలానికి రాపూర్ సీఐ సత్య నారాయణ, సైదాపురం ఎస్ఐ కాంతి కుమార్ చేరుకొని పరిశీలించి క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టారు.

### టిప్పర్.. బొలెరో ఘటన ప్రాంతంలో మాయం

సంఘటన స్థలంలో ఉన్న వాహనదారుల సమాచారం మేరకు వస్తున్నటువంటి లారీని క్రాస్ చేసి ఓ బొలెరో లారీ ముందు ఆపి ఉండడం యువకుల ఇద్దరి మరణానికి పరోక్షంగా ఆయన కారణం అయిన లారి, లారీని ఆపిన తెల్లబోలోరా వాహనం ప్రమాదం జరిగిన వెంటనే అక్కడనుండి పరారీ అయిపోవడం ఎన్నో ప్రశ్నలకు తావునిస్తుంది. పోలీసులు ఈ టిప్పర్ బొలెరో వాహనం అదుపులోనికి తీసుకుంటారా పెద్ద



స్థాయిలో వచ్చే ఒత్తిడికి తల తిప్పుకుంటారా చూడాలి గూడూరు ఆర్ అండ్ బి రోడ్డును చీద్రం చేస్తూ తరచు ఎన్నో ప్రమాదాలకు కారణం అవుతూ ఎన్నో ప్రాణాలు గాల్లో కలిపేస్తూ పరిమితులకు మించి అధిక లోడులతో అతివేగంతో యమపాశంలో దూసుకెళ్తున్న టిప్పర్లపై లారీలపై ప్రభుత్వ అధికారులు తనిఖీలు నిర్వహించారా? వరుస ప్రమాదాలు జరుగుతున్న ప్రాణాలు కోల్పోతున్న ఎందుకు మౌనం నెల నెల మామూలు నాలుగు రాళు కోసమేనా.! మరోసారి ఈ టిప్పర్ల వల్ల మరో ప్రమాదం జరగకముందే మరో ప్రాణం పోకముందే అధికారులు మొద్దు నిద్ర వదలాలి నిబంధనలు పాటించని టిప్పర్లు క్షేత్రస్థాయిలో విచారించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# కృష్ణపట్నం చిరు వ్యాపారస్తులకు సదుపాయాలు

### అదాని ఫౌండేషన్ సిఎస్ఆర్ హెడ్ రాజేష్ రంజన్

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** కృష్ణపట్నం బైపాస్ రోడ్డు జీరో పాయింట్ సమీపాన చిరు వ్యాపారాలు సాగిస్తున్న కృష్ణపట్నం గ్రామస్తులకు తగిన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని అదాని ఫౌండేషన్ సిఎస్ఆర్ హెడ్ రాజేష్ రంజన్ తెలిపారు. చిరు వ్యాపారస్తులు పడుతున్న బాధలను కొంతమంది గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వర్షం వస్తే తడుస్తూ, ఎండ వస్తే ఎండుతూ, కనీసం మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో ఆ దుకాణాలను సి ఎస్ ఆర్ హెడ్ ఆదివారం పరిశీలించారు. సమస్యను అడిగి తెలుసుకున్నారు. గతంలో కృష్ణపట్నం పోర్టులో బొగ్గు లారీలు వస్తుండగా వ్యాపారాలు సాగించామని ప్రస్తుతం ఆ లారీలకు పార్కింగ్ సౌకర్యాన్ని ఇక్కడ ఇవ్వడం వల్ల ఈ ప్రాంతంలో వ్యాపారం తప్పదని తెలియజేశారు. మరుగుదొడ్లు లేక ఇబ్బందులు



పడుతున్నామని అదే విధంగా రేకుల షెడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఏకేపీఎల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తామని సిఎస్ఆర్ హెడ్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా చిరు వ్యాపారస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

# ఆధునిక సాంకేతిక పరికరాలను సమర్ధవంతంగా నిర్వహించాలి



- బీవీ నగర్ సెక్షన్‌లో ఆటో రిక్లోజర్ ఏబి స్విచ్ పనితీరు పరిశీలన
- ఏపీ ఎస్పీడీసీఎల్ టెక్నికల్? డైరెక్టర్ కే.గురవయ్య

**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** ఆధునిక సాంకేతికతతో అందుబాటులోకి వస్తున్న విద్యుత్ పరికరాలను సమర్ధవంతంగా నిర్వహించాలని ఏపీఎస్పీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ అండ్ హెచ్ఆర్‌డి కే.గురవయ్య సూచించారు. నెల్లూరు జిల్లా విద్యుత్ శాఖ పర్యటనలో భాగంగా ఆదివారం ఆంధ్రప్రదేశ్ దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ నెల్లూరు టౌన్ డివిజన్ ఆధీనంలో ఉన్న బీవీ నగర్ సెక్షన్ నందు నూతనంగా ఏర్పాటు చేసిన ఆటో రిక్లోజర్ ఎబి స్విచ్ పనితీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటో రిక్లోజర్ ద్వారా విద్యుత్ సరఫరా విశ్వసనీయత, లోపాల సమయంలో త్వరితగతిన సరఫరా పునరుద్ధరణ, పరికరాల సమర్ధ నిర్వహణపై అధికారులకు సూచనలు చేశారు. విద్యుత్ అంతరాయాలను తగ్గించే దిశగా ఆధునిక సాంకేతిక పరికరాలను సమర్థంగా వినియోగించాలని తెలిపారు. విద్యుత్ సరఫరా నాణ్యత మెరుగుపర్చడంలో ఇటువంటి పర్యవేక్షణలు కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండింగ్ ఇంజనీరు కె.రాఘవేంద్రం, టౌన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు మన్నేపల్లి శ్రీధర్, టెక్నికల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బాలచంద్ర, అసిస్టెంట్ ఇంజనీరు రాంప్రసాద్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్షలకు 144 సెక్షన్ : ఎస్ఐ



**రాపూరు, మేజర్‌న్యూస్ :** నేటి నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పరీక్షల దృష్ట్యా సోమవారం పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నట్లు రాపూరు ఎస్ఐ ఎం.వెంకట రాజేష్ ఆదివారం తెలిపారు. పరీక్షా కేంద్రానికి ఇరువైపులా ఉన్న జెరాక్స్ దుకాణాలను మూసివేయాలని ఆయన సూచించారు. పరీక్షలు జరిగే సమయంలో ఆకతాయి కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ రాజేష్ పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ పరీక్ష దృష్ట్యా గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట రాజేష్ వెల్లడించారు. రాపూరు పరీక్ష కేంద్రంలో ఫస్ట్ ఇయర్ నుండి 207 మంది విద్యార్థులు, ఫస్ట్ ఇయర్ నుండి 18 మంది ఒకేషనల్ విద్యార్థినీ విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. రాపూరు ప్రభుత్వ సివీకె జూనియర్ కళాశాలలో జరగనున్న పరీక్షలకు రాపూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, వినాయక జూనియర్ కళాశాల విద్యార్థులు, కండలేరు సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కాలేజీ విద్యార్థులు, సైదాపురం జూనియర్ కాలేజ్ విద్యార్థులు పరీక్షలు వ్రాయనున్నారు.

## ఘనంగా ఉయ్యాలావాడ వర్ధంతి




**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రేనాటి సూర్యుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 179వ వర్ధంతి వేడుకలు ఆదివారం ఆత్మకూరు ఉప రవాణా శాఖ కార్యాలయంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.రాములు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించి ఆయన స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ దేశం పట్ల బాధ్యతాయుతంగా మెలగాలని రాములు సూచించారు. తొలి తరం భారత స్వాతంత్ర్య సమర యోధుడు, బ్రిటిష్ వారిని గడగడ లాడించిన వీరుడు ఉయ్యాలావాడ నరసింహారెడ్డి అని రాములు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ కార్యాలయం సిబ్బంది, పలువురు వాహనకారులు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి పాలనలో ఏడు కోట్లతో అభివృద్ధి పనులు



**జలదంకి, మేజర్‌న్యూస్ :** కూటమి పాలనలో జలదంకి మండలంలో రెండు సంవత్సరాలలోనే ఏడు కోట్ల నిధులతో అభివృద్ధి పనులు జరిగాయని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మునగాల తిరుమలరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నాగిరెడ్డి పాలెం గ్రామ సీసీ రోడ్డుకు 88 లక్షల నిధులతో శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో మండలం అన్ని విధాల అభివృద్ధి చెందుతుంది అన్నారు. బ్రాహ్మణకాక పంచాయతీ అగ్రహారం, చామదాలలో పిహెచ్సి నిర్మిస్తే పరిసర గ్రామాల ప్రజలకు వైద్య పరంగా ఇబ్బందులు లేకుండా ఉంటుందన్నారు. ఈ దిశగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామన్నారు. త్వరలో మోడల్ స్కూల్ నిర్మాణానికి శ్రీకారం చూడతామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ మాజీ కన్వీనర్, సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షులు పులుగుంట మధుమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. కూటమి పాలనలో ఇప్పటికే 2.8 కోట్ల రూపాయల నిధులతో సిసి రోడ్ల నిర్మాణం జరిగిందన్నారు. నాగిరెడ్డిపాలెం సిసి రోడ్డు శంకుస్థాపనతో నాగిరెడ్డిపాలెం వాసుల కల నెరవేరింది అన్నారు. ఈ కార్యక్రమంలో జలదంకి మండల టిడిపి కన్వీనర్ మునగాల తిరుమలరెడ్డి, వంటేరు జయచంద్ర రెడ్డి, సొసైటీ చైర్మన్ కరియావుల అప్పలనాయుడు, పూనూరు భాస్కర్ రెడ్డి, దగుమాటి మాల్యాద్రి రెడ్డి, వద్దే శ్రీనాథ్ రెడ్డి, ముడి కిషోర్ రెడ్డి, వంటేరు రాకేష్, నిమ్మలపల్లి రామ చైతన్య, తోట మురళీ, సురే శేషారెడ్డి, వింతా సుబ్బారెడ్డి, పులుగుంట మహేంద్రరెడ్డి, కంకు వెంకటేశ్వర్లు, మారుబోయిన నారాయణ, మారుబోయిన సుందరయ్య, వర్ధినేని చిన్నబ్బయ్య నాయుడు, గంటా సుబ్బానాయుడు, గంటా అశోక్, మాదిరెడ్డి సుబ్బారెడ్డి, బీమవరపు తిరుపతయ్య, పంచాయతీరాజ్ ఏఈ శ్రీవాణి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మనోజ్, నాగిరెడ్డిపాలెం గ్రామస్తులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా నాకా బంద్.. లాడ్జీలపై ఆకస్మిక తనిఖీలు

● 1563 వాహనాలు తనిఖీ ● రూ.1.12 లక్షల జరిమానా ● 54 లాడ్జీల్లో చెకింగ్ ● 22 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు





**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** జిల్లా వ్యాప్తంగా నేర నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణ, అసాంఘిక కార్యకలాపాల అడ్డుకట్టే లక్ష్యంగా జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు జిల్లా పోలీసులు అధికారులు జిల్లా వ్యాప్తంగా ఆదివారం రాత్రి నాకా బంద్ నిర్వహించి లాడ్జీలపై ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా మొత్తం 54 లాడ్జీలు పరిశీలించగా, 1563 వాహనాలు తనిఖీ చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్ 22, ఓపెన్ డ్రింకింగ్ 18, ఎంవీ యాక్ట్ కేసులు 142 నమోదు చేసి మొత్తం రూ. 1,12,485 జరిమానా విధించారు. అదేవిధంగా జిల్లాలోని ప్రధాన కూడళ్లలో, హైవేలు, ప్రవేశ--నిష్క్రమణ మార్గాల్లో వాహనాలపై విస్తృత తనిఖీలు చేపట్టారు. అతివేగం, ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ఓవర్‌లోడింగ్, డెఫెక్టివ్ నంబర్ ప్లేట్లపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పోలీసులు అధికారులు హెచ్చరించారు. లాడ్జీల్లో ప్రతి గదిని పరిశీలించి అనుమానాస్పద వ్యక్తులను విచారించి వేలిముద్రలు సేకరించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా యస్.పి. స్పష్టం చేశారు. అనుమానాస్పద సమాచారం ఉంటే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ లేదా డయల్ 112కు తెలియజేయాలని ప్రజలను కోరారు.

# దోమలు కుట్టకుండా జాగ్రత్త పడాలి

## పందులను నివాసాలకు దూరంగా ఉంచాలి



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** చిన్నపిల్లలకు దోమల పుట్టకుండా జాగ్రత్తపడి అనారోగ్యం పాలు కాకుండా చూసుకోవాల్సిన అవసరం తల్లిదండ్రులపై ఉందని విశ్రాంత డిఎం అండ్ హెచ్ఓ కె.మాశిలామణి తెలిపారు. ఆదివారం ప్రపంచ నగర వాపు దినోత్సవ సందర్భంగా స్థానిక మాశిలమని వైద్యశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నెల్లూరు అపోలో హాస్పిటల్ ఆర్థోపెడిక్ వైద్యాధికారి వివేకానంద రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాశిలామణి మాట్లాడుతూ.. మెదడువాపు వ్యాధి క్యూలెక్స్ దోమకుట్టడం వలన వస్తుందన్నారు ఈ దోమ ముందుగా పందులను కుట్టి ఆ తర్వాత పిల్లలనుకుట్టడంతో సంవత్సరం నుండి 14 సంవత్సరాల లోపు వయసు ఉన్న పిల్లలకు ఈ వ్యాధి సంక్రమిస్తుందని తెలిపారు. ఈ వ్యాధి 5 నుండి 12 రోజుల్లోపు బయటపడుతుందన్నారు. ఈ వ్యాధి లక్షణాలు మెదడువాపు వ్యాధి సోకిన వారికి జ్వరము చలి మెడ నొప్పులు వాంతులు కావడం తల తిరగడం జరుగుతుందని తెలిపారు. రెండవ దశలో చూపు కోల్పోవడం మనుషులను గుర్తించలేకపోవడం వాంతులు రావడం జరుగుతుందన్నారు. మూడవ దశలో స్పృహతప్పి పడిపోవడం తీవ్రమైన వాంతులకు గురికావడం కొన్ని పరిస్థితులలో చనిపోవడం కూడా జరుగుతుందని తెలిపారు ఈ వ్యాధి నివారణకు ప్రభుత్వ వైద్యశాలలో సంప్రదించి క్రమం తప్పకుండా వ్యాక్సిన్ లను తీసుకోవాలని తెలిపారు కావున ఈ వ్యాధి నివారించుకోవడానికి తమ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పందులను ఊరికి దూరంగా ఉంచాలని తెలియజేశారు. పందుల వలన ముఖ్యంగా ఈ వ్యాధి సోకుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యశాల సిబ్బంది రోగులు తదితరులు ఉన్నారు.

## అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు వాక్-ఇన్ ఇంటర్వ్యూ

**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** వీఎస్‌యులోని విశ్వవిద్యాలయ కళాశాలలో మెరైన్ బయాలజీ ప్రోగ్రామ్‌కు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టును భర్తీ చేయడానికి వాక్-ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత పత్రికా ప్రకటనలో తెలిపారు. ఎంఓఈఎస్, డిఓఎంఎస్ఐటి ప్రాయోజిత ఈ ప్రోగ్రామ్‌లో పూర్తి తాత్కాలిక (కన్సాలిడేటెడ్), కాంట్రాక్టు విధానంలో నియామకం చేపట్టనున్నారు. సంబంధిత సబ్జెక్టులో పీజీతో పాటు పీహెచ్‌డీ/నెట్/సెట్/స్లెట్ అర్హత కలిగిన అభ్యర్థులు 2026 ఫిబ్రవరి 25న ఉదయం 11:30 గంటలకు కాకుటూరులోని డాక్టర్ వైఎస్సార్ పరిపాలన భవనంలో జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. అభ్యర్థులు ఇంటర్వ్యూకు గంట ముందుగా ధ్రువపత్రాల పరిశీలనకు హాజరై, సెలక్షన్ కమిటీ ముందు డెమో ఇవ్వాల్సి ఉంటుంది. ఖాళీలను భర్తీ చేయడం, పెంచడం, తగ్గించడం లేదా రద్దు చేయడం వంటి హక్కులు విశ్వవిద్యాలయానికి ఉంటాయని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

## విద్యుత్ విశ్రాంత సీజీఎం ఇంట పెళ్లి సందడి

● నవ దంపతులకు ప్రముఖుల ఆశీర్వచనాలు



**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని కస్తూరి దేవి గార్డెన్స్ నందు ఆదివారం ఆత్మీయ వాతావరణంలో నిర్వహించిన విద్యుత్ శాఖ సీజీఎం (రిటైర్డ్)కె. విజయ్ కుమార్‌రెడ్డి కుమారుడి వివాహ వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి మాజీ చైర్మన్ ఠాకూర్ రామసింగ్ నవ దంపతులకు వివాహ మహోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ క్రమంలోనే నెల్లూరు టౌన్, కన్ స్ట్రక్షన్ డివిజన్ విభాగాలకు చెందిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు మన్నేపల్లి శ్రీధర్, శ్రీనివాసులు రెడ్డిలు వివాహ వేడుకల్లో పాల్గొని నూతన దంపతులకు తమ ఆశీర్వాదాలు అందజేశారు. ఈ సందర్భంగా వధూ వరులకు సుఖసంతోషాలతో కూడిన దాంపత్య జీవితం కలగాలని ఆకాంక్షిస్తూ, వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

## బీసీ సింహ గర్జనకు తరలిన బీసీవై నాయకులు



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** బీసీ సింహ గర్జనకు బయలుదేరిన పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బీసీవై పార్టీ జిల్లా ప్రతినిధులు, కార్యవర్గ సభ్యులు జ్యోతిరావు పూలే సావిత్రిబాయి పూలే విగ్రహాలకు గజ మాలలు వేసి నివాళులర్పించి గుంటూరు హైవే నాగార్జున యూనివర్సిటీ క్యాంపస్ ఎదురుగా జరుగుతున్న బీసీ సింహ గర్జనకు నెల్లూరు జిల్లా నుండి వేలాదిమందితో బయలుదేరిన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బీసీవై పార్టీ జిల్లా అధ్యక్షులు బుధవరపు బాలాజీ, రాష్ట్ర యూత్ కో కన్వీనర్ లీలా కృష్ణ యాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యులు రామనాథం రాజశేఖర్, మార్కాపురం లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొనడం జరిగింది.

## మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మైనర్లకు వాహనాలు ఇస్తే సంబంధిత యజమానులపై కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి హెచ్చరించారు. ఆదివారం స్థానిక మెయిన్ బజార్లో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఏలాంటి పత్రాలు లేని, ట్రాఫిక్ నిబంధనలను పాటించని వాహనాలకు అపరాధరుసుం విధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఇటీవల కొందరు వాహనదారులు హెల్మెట్ ధరించక ప్రాణాలు పోగొట్టుకున్నారన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపినా, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోయినా కఠిన చర్యలు తీసుకొంటామన్నారు. ఆటోవాలాలు పరిమితికిమించి ప్రయాణికులను చేరవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# కల్లూరుపల్లి టిడ్కో గృహాలలో కార్డన్ సెర్చ్





**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ పరిధిలోని కల్లూరి పల్లి టిడ్కో గృహాల నందు జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ సౌజన్య సూచనలతో రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాస రావు ఆధ్వర్యంలో ఆదివారం కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. సుమారు 60 మందితో సెర్చ్ ఆపరేషన్ నిర్వహించి టిట్కో గృహాలలోని సుమారు 200 ఇళ్లను క్షుణ్ణంగా శోధించి తనిఖీలు చేపట్టార. సరైన పత్రాలు లేని 26 బైకులు, రెండు ఆటోలను స్వాధీనం చేసుకొని అనుమా నితుల దగ్గర వేలిముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సామాన్య ప్రజలలో ధైర్యం నింపు తూ పోలీసు వ్యవస్థ పట్ల విశ్వాసం పెంచడానికి, నేర నియంత్రణ, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నివారణే ఈ శోధనల ముఖ్య ఉద్దేశమని రూరల్ డీఎస్పీ తెలియజేశారు. అంతేకాకుండా అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 112/100 లేదా పోలీస్ కంట్రోల్ వాట్సాప్ నంబర్‌కు తెలియ జేయాలని ప్రజలను కోరారు. ఈ సెర్చ్ ఆపరేషన్‌లో రూరల్ సబ్ డివిజన్ సిఐలు, ఎస్ఐలు, స్పెషల్ పార్టీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నేడు డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ కార్యక్రమం

- **డయల్ చేయవలసిన నెంబర్ 0861-2320427**
- **జిల్లా పర్యవేక్షక ఇంజనీరు కే.రాఘువేంద్రం**



**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ నెల్లూరు జిల్లాలోని వినియోగదారుల సమస్యల పరిష్కారం నిమిత్తం సోమవారం ఉదయం 8:30 నుంచి 9:30 గంటల వరకు స్థానిక దర్గామిట్ట వద్దనున్న విద్యుత్ భవన్ నందు నిర్వహించే డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీరు కె.రాఘువేంద్రం తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశాల మేరకు, ప్రతి సోమవారం 'డయల్ యువర్ ఎస్ఈ' కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా వినియోగదారుల నుండి సమస్యలను నేరుగా స్వీకరించి, వాటిని సత్వరంగా పరిష్కరించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రతి సోమవారం ఉదయం 8.30 గంటల నుండి 9.30 గంటల వరకు నిర్వహించే డయల్ యువర్ ఎస్ఈ ద్వారా వినియోగదారులు 0861-2320427 నెంబర్‌కు ఫోన్ చేసి తమ విద్యుత్ సంబంధిత సమస్యలు, సూచనలు నేరుగా తెలియజేయవచ్చని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని వినియోగదారు లందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

# పనే దైవంగా భావించినప్పుడు విజయం : మొగుళ్ళూరు మాస్టర్ దుర్గ



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** పనిని దైవంగా భావించినప్పుడు విజయం వెతుక్కుంటూ మన కాళ్ల దగ్గరికి వచ్చి మనం అనుకున్నవన్నీ సఫలీకృతమవుతాయని మొగులూరు సీనియర్ పిరమిడ్ మాస్టర్ వెంకట శివ నాగ దుర్గ అన్నారు వింజమూరులోని శ్రీ వేదవ్యాస వశిష్ట పిరమిడ్ ధ్యాన మహా శక్తి క్షేత్రము నందు ఆదివారం ఆత్మజ్ఞానం కార్యక్రమంలో భాగంగా ఆమె పాల్గొని అద్భుతమైన ఆధ్యాత్మిక సందేశాన్ని అందించారు. అనేక న్యూరోబిక్ ఆసనాలను అందరి చేత ప్రాక్టీస్ చేయించి అనేక దైవిక వాక్యాలను పలికించారు. ప్రతి ఒక్కరూ ప్రతిరోజు వీటిని ఆచరించినచో అనుకున్నవి సాధ్యమవుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ సమయపాలన, ధైర్యం, జ్ఞానం, ఇష్టం, అంకితభావం, ఎరుక, బాధ్యత తో మెలగాలని అప్పుడు మాత్రమే 'ఆచరణం శరణం గచ్ఛామి' సాధ్యమవుతుందని తెలిపారు. అనేక ఆధ్యాత్మిక గీతాలను శ్రావ్యంగా పాడి ఆలపించారు వీరి జ్ఞానం అందరికీ ఎంతో ఉపయుక్తంగా ఆచరణాత్మకంగా అర్థమయ్యే రీతిలో ఉన్నది మీరు చెప్పిన ఆసనాలను చేసిన తర్వాత ధ్యానం చేసినచో త్వరగా ఆలోచన రైతు స్థితి అనగా శూన్యస్థితికి చేరుకోవచ్చు అని తెలిసింది మీరు ప్రతి ఒక్కరూ ధ్యాన సాధనతోపాటు స్వాధ్యాయం, సజ్జన సాంగత్యం, సేవ, ధ్యాన ప్రచారం చేయాలని, అప్పుడే అనేక కర్మలు ప్రక్షాళన జరిగి, ఆధ్యాత్మిక ఎదుగుదల అద్భుతంగా ఉంటుందని, తదుపరి జన్మలో త్వరగా ధ్యానం పరిచయమవుతుందని తెలియజేశారు. వీరి కుటుంబ సభ్యులందరూ ఎప్పుడు ధ్యానం సేవలో లీనమై ఉన్నారని ఇది ఎంతో అద్భుతమైన కార్యక్రమమని మానవ జన్మకు అసలు సిసలైన లక్ష్యము సాధించేందుకు ఎప్పుడు తపన పడటం ప్రశంసనీయమన్నారు. ఈరోజు ధ్యాన సాధన క్లాసుకు హాజరైన ధ్యానులందరికీ స్వాతి మరియు బాబురావు చక్కటి ధ్యాన ప్రసాదం అందించారు మాస్టర్ ని సాలువతో సత్కరించారు ఈ కార్యక్రమంలో హేమలత, సుబ్బలక్ష్మి, రాజేశ్వరి, ఉమా, ఆదిలక్ష్మి, స్వరాజ్యం,పెంచలమ్మ, రవిచంద్ర, అంకిరెడ్డి, జానకిరామ్ రెడ్డి, ఆచారి ఇంకా 50 మంది ధ్యానులు పాల్గొన్నారు.

## కాకాణి ఆరోపణలపై చవటపాళెం వాసుల ఆగ్రహం



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** మండలంలోని చవటపాళెంలో ఇసుక ట్రాక్టర్లను ఆపి డబ్బులు వసూలు చేస్తున్నారన్న కాకాని గోవర్ధన్‌రెడ్డి ఆరోపణలను గ్రామస్తులు ఖండించారు. జాతీయ స్థాయి విద్యాసంస్థ కోసం తమ భూములు త్యాగం చేశామని, స్థానికులకు ఉపాధి కల్పించాలని అడిగితే తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. గ్రామంలో ఉన్న ట్రాక్టర్లకు పనివేళలు ఇవ్వాలని, ఇతర ప్రాంతాల నాయకుల జోక్యం అంగీకరించబోమని హెచ్చరించారు.

## తెలుగు భాషలో మహత్తరమైన శక్తి దాగి ఉంది



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** తెలుగు భాషలో మహత్తరమైన శక్తి దాగి ఉందని, ఆశక్తితో అద్భుతాలు సృష్టించవచ్చని సామాజికవేత్త, గురజాడఅవార్డు గ్రహీత గండికోట సుధీర్ కుమార్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అమ్మ ఒడిలో నేర్చుకున్న భాషతో ఆత్మవిశ్వాసం, అవగాహన, భావోద్వేగాలు వ్యక్తపరచడం ఉత్తమంగా ఉంటాయన్నారు. అమృతతుల్యమైన తెలుగు భాషకు సంబంధించిన అనేక పుస్తకాలు గ్రంథాలయాలలో అందుబాటులో ఉంటాయని, వాటిని విద్యార్థులు ఉపయోగించుకోవాలన్నారు. తెలుగు భాషలో పద్యాలు, పాటలు, రచనలు చేసిన గురజాడ అప్పారావు, గుర్రం జాషువా, తాపీ ధర్మారావు, అయ్యంకి వెంకటరమణయ్య వంటి మహనీయులను ఈ సందర్భంగా స్మరించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు శతక పద్య పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాలకులు ఏ నరసింహారావు, ఎర్రయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

## బీజేపీ మన్ కీ బాత్ కార్యక్రమం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు మండల బీజేపీ అధ్యక్షులు అంబటి ఈశ్వర్ రెడ్డి.ఆధ్వర్యంలో భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మన్ కీ బాత్ కార్యక్రమం ఆదివారం వింజమూరు లోని సరస్వతి హై స్కూల్ నందు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమం ను స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, నాయకులు, కార్యకర్తలతో కలసి వీక్షకిం చడం జరిగింది. కార్యక్రమంలోనిఅంశాలను విద్యార్థులు కు వివరించారు భారతదేశంపై విద్యార్థులకు దేశభక్తి ప్రభోధితమైన అంశాలను చూపె ట్టడం జరిగిందని అందుచేత ఇప్పటినుండి విద్యార్థులలో దేశభక్తి భావాల ను కలిగించడం సేవ కార్యక్రమాల పట్ల ఆసక్తిని పెంపొందించడం ఈ అంశాల్లో ముఖ్యమైనవని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సరస్వతి హై స్కూల్ కరాస్పాండంట్ పోలు అంకిరెడ్డి, ఉపాధ్యాయులు, నాయకులు గనీరమణయ్య, మల్లం కొండారెడ్డి, భువన సుబ్బారెడ్డి, ఎం.రామచంద్ర, డి.ప్రసాద్, డి.నారాయణరెడ్డి, ఏ.నాగేంద్ర,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉగాది మహోత్సవ పుష్కారాల్లో జ్యోతిష వైభవ సేవక పురస్కారం



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** ముత్తుకూరుకు చెందిన జ్యోతిష శిరోమణి డాక్టర్ జివిబి మురళీకృష్ణ అత్యంత ప్రాముఖ్యత కలిగిన జ్యోతిష వైభవ సేవక పురస్కారాన్ని పొందారు. తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాల్లో కూడా ఈ రంగంలో పేరుపొందిన ఆయన జ్యోతిష శాస్త్రంలో మరోసారి చరిత్ర సృష్టించారు. విజయవాడ ప్రాంతంలో వేదికగా చేసుకుని సర్ సివి రామన్ అకాడమీ 38వ ఉగాది మహోత్సవ పురస్కారాల్లో నిర్వహించిన కార్యక్రమంలో తుమ్మలపల్లి కళాక్షేత్ర నందు అరుదైన పురస్కారాన్ని ప్రము ఖుల మధ్య పొందారు. ఆధ్యాత్మికవేత్త శ్రీకృష్ణ చాముండేశ్వర మహర్షి, వ్యాపారవేత్త, సినీ ప్రముఖులు అంబికా కృష్ణతన చేతుల మీదుగా అంద జేశారు. ఈ సందర్భంగా మండల ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

# 13ఏళ్ళయినా పూర్తికాని తహసిల్దారు కార్యాలయ భవన నిర్మాణం



శిధిలభవనంలో తహశిల్దారు కార్యాలయం



దశాబ్దం దాటినా నిర్మాణం పూర్తికాని నూతన భవనం

భవన నిర్మాణ శంఖు స్థాపన శిలా ఫలకం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో అనేక భవనాలు నిర్మాణంలో అర్ధాంతరంగా నిలిచిపోవడం, వాటిని గురించి పట్టించుకొనకపోతుండడం పరిపాటిగా ఉండగా అత్యంత ప్రాధాన్యత కలిగిన మండల రెవిన్యూ కార్యాలయ భవనం దశాబ్దం దాటినా నిర్మాణం పూర్తికాకుండా దర్శనమిస్తుండడం గమనార్హం. వర్షాల సమయంలో సిబ్బందిలో ఆందోళన కన్పిస్తోంది. నూతన భవనాలు ఒకటికాదు, రెండు కాదు ఏకంగా 13 సంవత్సరాల క్రితం శంఖుస్థాపన గావించబడి పనులు ప్రారంభమై శ్లాబ్‌లెవల్‌కు చేరగా ఈనాటికీ పూర్తికాకుండా అదేపరిస్థితి కొనసాగుతోంది. ప్రస్థుతం తహశిల్దారు కార్యాలయం కొనసాగుతున్న బ్రిటిష్‌కాలం నాటి భవనం శిధిలావస్థకు చేరుకోగా వర్షాలకు ఉరుస్తుండడంతో అధికారులు, సిబ్బంది ఇబ్బందిపడుతుండడం తోపాటు రికార్డులు తడిచిపోతాయనే ఆందోళనతో కొనసాగుతున్నారు. భవన పైకప్పుకు తార్పాలిన్ పట్టలు కప్పుకొని కాలం వెళ్ళబుచ్చుతున్నారు. 2012లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆర్థికశాఖా మాత్యులు ఆత్మకూరు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తూ దాదాపు 2500కోట్ల రూపాయల నిధులు సాధించి అనేక రోడ్లు, భవనాలు, సంస్థలు, వంతెనలు తదితరాలను సాధించారు. అందులో భాగంగా ఆత్మకూరు మండల రెవిన్యూకార్యాలయ ఆవరణలో తహశిల్దారు కార్యాలయం, ఆర్డీవో కార్యాల యం, సబ్ ట్రెజరీ భవనాల నిర్మాణాలకు 3కోట్ల రూపాయలను ఆనం రామనారాయణరెడ్డి మంజూరు చేయించి అప్పటి రెవిన్యూమంత్రి ఎన్.రఘువీరారెడ్డిని రప్పించి శంఖుస్థాపనలు గావించారు. కాగా ట్రెజరీ కార్యాలయం తమ శాఖనిధులు సాధించుకొని భవనం నిర్మించుకొని శిధిలమైన భవనం నుండి నూతన భవనంలోకి మారారు. రెవిన్యూ డివిజన్ కార్యాలయ భవనం నిర్మాణం నిలిచిపోయిఉండగా ఏడాదిన్నర క్రితం అప్పటి కలెక్టర్ చొరవతీసుకొని పనులు పూర్తిచేయించి ప్రారంభోత్సవం గావించి ఆర్డీవో కార్యాలయాన్ని నూతన భవనంలోకి తరలించారు. ఇక తహశిల్దారు కార్యాలయ భవనం మాత్రం అలాగే శ్లాబ్‌లెవల్‌లో దర్శనమిస్తోంది. అయితే ఈ ఈదపా మళ్ళీ ఆత్మకూరు ఎమ్మెల్యేగా ఆనం రామనారాయణరెడ్డి విజయం సాధించడం, రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రిగా కొనసాగుతుండడం జరగ్గా ఆయన ఈ భవనాన్ని పరిశీలించి తాను ఆనాడు మంజూరుచేయించి ఇంకా పూర్తికాకపోవడం బాధాకరమని పేర్కొంటూ పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కానీ ఇంకా సంబంధిత అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు కానరావడం లేదు. వర్షాకాలంలో అధికారులు, సిబ్బంది తీవ్రంగా ఇబ్బందిపడుతూ ఆందోళన చెందుతున్న పరిస్థితిని గమనించి ఇప్పటికైనా ఈ భవనం నిర్మాణం పూర్తిచేయాలని, రామనారాయణరెడ్డి ఎంతో శ్రద్ధతో నిధులు సాధించిన భవనాన్ని పూర్తిచేసి ఆయన సంకల్పానికి సార్ధకత చేకూర్చాలని సర్వత్రా కోరుతున్నారు.

## రీ సర్వేలో తప్పిదాలను పట్టించుకునేవారు కరువయ్యారు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** రీ సర్వేలో జరిగిన తప్పిదాలను సవరించాలని రైతులు రెవెన్యూ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా పట్టించుకునే వారు కర వయ్యారని సీపీఎం జిల్లా నాయకులు కటారి అజయకుమార్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చేపట్టిన రీ సర్వేలో చోటుచేసుకున్న తప్పిదాలతో రైతులకు ప్రభుత్వ పథకాలు దక్కక, రుణాలు రాక గత మూడేళ్లుగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యను పరిష్కరించాలని జిల్లా, స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. భూములు విక్రయించి ఆర్థిక ఇబ్బందులు



తీర్చుకుందామనుకున్నా అవకాశం లేక రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతుల సమస్యలు పరిష్కరించకుంటే రైతు సం మాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కాకు వెంకటయ్య, కోడె రమణయ్య, పరుద్దీన్ బాషా, నాయబ్ రసూల్, కామాక్షమ్మ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయాన్ని అందించిన మానవతా సంస్థ



**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** మండలంలోని తూర్పు కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన డయాలిస్ పేషెంట్ నాగేశ్వరరావు వరికుంటపాడు పంచాయతీకి చెందిన దీకాల కాంతమ్మకు పామూరు మానవతా సంస్థ ఒక్కొక్కరికి 5వేల రూపాయల నగదును ఆర్థిక సహాయం అందజేసి అండగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా గుంటుపల్లి రామయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మానవతా సంస్థ అధ్యక్షులు వెండిదండి వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. వారికి మా సమస్త ఎల్లవేళలా అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ కల్లూరి రామిరెడ్డి, కార్యదర్శి తూదెడ్డి వెంకటేశ్వర రావు, కన్వీనర్ తోటరమేష్, కారంశెట్టి వెంకటేశ్వర్లు, బత్తుల సుబ్బారావు, వేముల జయరాములు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** మండలంలోని కాకుటూరు గ్రామం వద్ద నేషనల్ హైవే 16పై జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. గుర్తు తెలియని వాహనం ఢీకొని పలుకురి బాబురావు (58) తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. ఘటనపై వి సత్రం పోలీస్ స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## బిడ్డ ఆచూకీ కోసం తల్లి మనోవేదన



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండల బట్టేపాడు గ్రామానికి చెందిన దేవరపాటి వెంకటేశ్వర్లు(30) భార్యాభర్తలు గొడవల కారణంగా బుధవారం ఇంట్లో నుంచి ఎక్కడికో వెళ్లిపోయారు. కుటుంబ సభ్యులకు కనిపించకుండా పోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వింజమూరులో ఆదివారం ఏడుస్తూ తిరుగుతూ ప్రజలకు ఫోటో చూపించి తన బిడ్డ ఆచూకీ తెలపాలని తల్లి దేవరపాటి జయమ్మ రోధిస్తుంది. ఈ దృశ్యాన్ని చూసిన స్థానికులకు మనసు కలచి వేస్తుంది. అయ్యా దేవరపాటి వెంకటేశ్వర్లు నువ్వు ఎక్కడున్నా ఇంటికి రావాలని మీ తల్లి, స్థానికులు కోరుతున్నారు.

## వంగవీటి మోహనరంగా విగ్రహానికి భూమిపూజ



**జలదంకి, మేజర్‌న్యూస్ :** వేములపాడు గ్రామంలో ఆదివారం వంగవీటి మోహన్‌రంగా నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు, బిజెపి, జనసేన నాయకులు, వేములపాడు నాయకులు తేలపోలు పెంచలయ్య ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వెములపాడు గ్రామంలో వంగవీటి మోహన్ రంగా విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో ముఖ్యఅతిధులుగా పాలుగోన్న జలదంకి మండలం కూటమి వడ్డె శ్రీనాథ్‌రెడ్డి, చిత్తా బత్తిన మస్తాన్‌రెడ్డి, పచ్చా పెంచుల నాయుడు, ముడి కిషోర్ రెడ్డి, రాకేష్ వంటేరు నాయకులు, ఉదయగిరి నియోజకవర్గ అధ్యక్షులు పత్తి సుబ్బారావు, జలదంకి అధ్యక్షులు పోలిశెట్టి మహేంద్ర, జలదంకి మండలం కాపు నాయకులు, వేములపాడు కాపు నాయుకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా చికెన్ వ్యర్థాల రవాణా.. ఇద్దరిపై కేసు




**వెంకటాచలం, మేజర్ న్యూస్ :** వి సత్రం పోలీస్ స్టేషన్ పరిధి లోని వెంకటాచలం టోల్ గేట్ వద్ద అక్రమంగా చికెన్ వ్యర్థాలు రవాణా చేస్తున్న వాహనాన్ని అధికారులు పట్టుకున్నారు. మత్స్యశాఖ సహాయ నిరీక్షకుడు అవుల పొట్టెయ్య తనిఖీలలో భాగంగా ఆశోక్ లేలాండ్ డోస్ట్ వాహనం (ఏపీ.39టీవై.3302)లో చికెన్ వ్యర్థాలు తరలిస్తున్నట్లు గుర్తించారు. డ్రైవర్ పేరం రాజు, వాహన యజమాని పేరం హనుమంతరావుపై కేసు నమోదు చేశారు. అనుమతి లేకుండా చికెన్ వ్యర్థాలు రవాణా చేయడం ద్వారా వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉండటంతోపాటు క్వారంటైన్ నిబంధనలు ఉల్లంఘించినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఫలించని అంగన్‌వాడీల ఉద్యమం

▸ అమలుకునోచుకోని నాటి వైసీపీ సర్కారు హామీలు ▸ ఫలితమివ్వని టీడీపీ హామీలు ▸ నేడే నుండి ఉద్యమబాట ▸ రిలేదీక్షలతో ప్రారంభం



అంగన్‌వాడీ కార్యకర్తల ధర్నా ఫైల్‌ఫోటో..



వివిధ పార్టీలనేతలు మద్దతుగా పాల్గొన్న దృశ్యం ఫైల్‌ఫోటో..



మోకాళ్లపై నిరసన తెలుపుతున్న దృశ్యం ఫైల్‌ఫోటో..

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ నియమాలమేరకు విద్యార్హతలు కలిగి, ఇంటర్వ్యూల్లో నెగ్గి అంగన్‌వాడీ కార్యకర్తలుగా నామమాత్రపు గౌరవవేతనంతో నియమితులై దశాబ్దాలతరబడి కొనసాగుతుండగా వారికి కనీసవేతనాలు లభించే పరిస్థితి కానరావడంలేదు. ఎన్నెన్నో ఉద్యమాలు, ఆందోళనలు, 42రోజులపాటు సమ్మె తదితర కార్యక్రమాలను నిర్వహించినా వారికి ఫలితం లభించలేదు. ప్రభుత్వం అనేక యాప్‌లు రూపొందించి అమలులోకి తేగా అవి సక్రమంగా పనిచేయక, ఆన్‌లైన్‌లో ఫోటోలు, వివరాలు నమోదుకాక గంటలతరబడి ఇబ్బందిపడుతూ విసిగివేసారిపోయి ఇటీవల తమవద్ద ఉన్న ఫోన్లను ప్రభుత్వానికి వాపసు చేయగా కొత్తఫోన్లను ఇచ్చారే కానీ వారి అసౌకర్యాన్ని గురించి పట్టించుకోలేదు. దాంతో రాష్ట్ర వ్యాప్తంగా మళ్ళీ ఉద్యమబాటపట్టేందుకు నిర్ణయించారు. ఈనెల 23వ తేదీ సోమవారం రాష్ట్రంలోని అన్ని ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయాలవద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు, 24వతేదీన అంగన్‌వాడీ సహాయకులు రిలెనిరాహారదీక్షలు నిర్వహించనున్నారు. 25వతేదీన జిల్లాలోని ఐసిడిఎస్ కార్యాలయాలవద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు, 26వతేదీన అంగన్‌వాడీ సహాయకులు రిలేదీక్షలు నిర్వహించనున్నారు. 27వతేదీన కలెక్టరేట్ల ఎదుట రిలేదీక్షలు నిర్వహించనున్నారు. మార్చి1వతేదీ ఛలో విజయవాడ కార్యక్రమం చేపట్టి 2వతేదీన విజయవాడలో మహాధర్నా నిర్వహించేలా రాష్ట్ర సిఐటియు అనుబంధ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కమిటీ నిర్ణయించగా ఈమేరకు ఆమా ప్రాజెక్టుల సిడిపివోలకు యూనియన్ తరపున నోటీసులిచ్చారు. 500రూపాయలతో ప్రారంభమైన అంగన్‌వాడీ కార్యకర్తలు, 250రూపాయలతో ప్రారంభమైన అంగన్‌వాడీ సహాయకులకు తరచూ ఉద్యమాలు సాగించగా అప్పుడప్పుడూ ప్రభుత్వాలు కొద్దికొద్దిగా వేతనాలు పెంచి నేడు అంగన్‌వాడీ కార్యకర్తలు 11500రూపాయలు, సహాయకులు 7000రూపాయల గౌరవవేతనం పొందుతున్నారు. పూర్తిసమయం కేటాయించి చిన్నారులకు పూర్వప్రాథమిక విద్యను అందిస్తూ గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తూ వారి ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకుంటున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు కనీసవేతనాలు కూడా లభించడంలేదంటూ 2023 డిసెంబర్12వతేదీనుండి 2024 జనవరి 24వ తేదీవరకు నిరవధికసమ్మె చేశారు. ధర్నాలు చేశారు. వివిధరకాల నిరసనలు చేశారు. వైసిపి మినహా అన్ని రాజకీయపార్టీలు, వివిధ ప్రజాసంఘాలవారు మద్దతిచ్చారు. సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఉద్యమం కొనసాగింది. అయితే అప్పటి వైసిపి ప్రభుత్వం అనేకరకాలుగా వారిని బెదిరించారు. నోటీసులిచ్చారు. ఉద్యోగాలు తొలగిస్తామంటూ షోకాజ్‌నోటీసులిచ్చారు. సచివాలయసిబ్బందితో అంగన్‌వాడీకేంద్రాలు నిర్వహిస్తామంటూ తాళాలు కూడా పగులగొట్టించారు. వారందరి ఉద్యోగాలు తొలగించి కొత్తవారిని నియమించుకునేలా నోటిఫికేషన్లు కూడా సిద్ధం చేశారు. దీర్ఘకాలింగా సంఘటితమైన అంగన్‌వాడీలు 43రోజులపాటు సమ్మెచేసి సంక్రాంతి,క్రిస్మస్ పండుగలను సైతం లెక్కచేయకుండా శిబిరాల్లోనే ఉన్నారు. పలుదపాలు అప్పటి వైసిపి ప్రభుత్వం ఉద్యమనేతలతో చర్చలు జరపడం, విఫలం కావడంతో 42వరోజుకు సమ్మె చేరిన సందర్భంగా ప్రభుత్వం తమ సలహాదారు సజ్జలరామకృష్ణారెడ్డిద్వారా ఉద్యమనేతలతో చర్చలు జరిపి కొన్ని హామీలిచ్చారు. అంగన్‌వాడీల వేతనాలు పెంచాలని, 26వేలరూపాయల కనీసవేతనాలివ్వాలని, మినీఅంగన్‌వాడీలను మెయిన్‌లుగా మార్చాలని, పెన్షన్ అమలుచేయాలని, గ్రాట్యుటీ ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రభుత్వ సంక్షేమపథకాలు వర్తింపజేయాలని, రిటైర్‌మెంట్‌బెనిఫిట్ 5లక్షలరూపాయలకు పెంచాలని, అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకురాలు ఎవరైనా మరణిస్తే ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని, యాప్‌లబెడద తొలగించి ఒకే యాప్ అమలు చేయాలని తదితర డిమాండ్లతో వారు దీర్ఘకాలిక ఉద్యమం సాగించారు.

## అమలుకాని వైసీపీ హామీలు

చర్చలద్వారా అప్పటి వైసీపీ ప్రభుత్వం కొన్ని హామీలివ్వగా జివో లిచ్చామన్నారే తప్ప అమలుకు నోచుకోలేదు. గ్రాట్యుటీ ఇస్తామని, రిటైర్‌మెంట్ బెనిఫిట్ కార్యకర్తలకు 50వేలనుండి 1.2లక్షలకు పెంచుతామని, సహాయకులకు 40వేలనుండి60వేలకు పెంచుతామని, రిటైర్‌మెంట్ వయసు 60నుండి 62సంవత్సరాలకు పెంచుతామని టిఏ, డిఏలు చెల్లిస్తామని హామీలిచ్చి ఆమేరకు జివోలిస్తున్నామని ప్రకటించారు. కనీసవేతనం, వేతనాల పెంపు విషయమై మాత్రం ఎలాంటి హామీ ఇవ్వలేదు. అయితే వారు ఈ ఉద్యమం అనంతరం 5నెలలు అధికారంలో ఉన్నా ఇచ్చిన హామీలను అమలుచేయకుండా నిర్లక్ష్యం చేశారని వారంతా వాపోతున్నారు.

## పట్టించుకోని టీడీపీ పాలకులు

నాటి సమ్మె సందర్భంగా మద్దతిచ్చిన తెలుగుదేశం అధినేతలు నారాచంద్రబాబునాయుడు, నారాలోకేష్‌బాబు తదితరులు అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులను వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం అత్యంత విచారకరమని పేర్కొన్నారు. తాము అధికారంలోకి వస్తే అంగన్‌వాడీలకు న్యాయం చేస్తామని, వారి న్యాయమైన కోర్కెలను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని హామీలిచ్చారు. నాలుగురోజుల క్రితం మహిళా, శిశు సంక్షేమశాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ అంగన్‌వాడీలకు న్యాయం చేస్తామన్నారు. అయితే ఏమేరకు న్యాయం చేస్తారు, ఏ కోర్కెలను ఆమోదిస్తారో స్పష్టం చేయలేదు. అయినా తెలుగుదేశం పాలకులపై నమ్మకం ఉందని, తమకు తప్పకుండా న్యాయం చేస్తారంటూ అంగన్‌వాడీలు పేర్కొంటూ ప్రభుత్వ నిర్ణయాలకోసం ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారు. మరి అంగన్‌వాడీలకు ఎలాంటి ప్రయోజనాలను ప్రభుత్వం కల్పిస్తుందో చూడాల్సి ఉంది.

---

### కళాకారులను నిర్లక్ష్యం చేయకుండా

# సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రంగస్థల, జానపద, పండిరిభజనల, తోలుబొమ్మలాటల, వీధిభాగవతల కళాకారుల సంక్షేమాన్ని గత ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన తెలుగుదేశం ప్రభుత్వమైనా తగు చర్యలు తీసుకోవాలని, ప్రత్యేకంగా సంక్షేమ కార్యక్రమాలు అమలుచేయాలని ఆత్మకూరు ప్రాంతంలోని కళాకారుల సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు. గత ప్రభుత్వం వద్ద ఎంతగా మొరపెట్టుకున్నా వృద్ధకళాకారులకు పెన్షన్లు, ఆర్టీసీబస్సుల్లో రాయితీ, కళాకారులకు గుర్తింపు కార్డుల మంజూరు, దేవాలయాల్లో, ఆధ్యాత్మిక కేంద్రాల్లో ప్రదర్శనలకు అవకాశం ఇవ్వకపోగా రంగస్థల వృత్తికళాకారులకు బ్రతుకుదెరువుగా ఉన్న చింతామణి నాటక ప్రదర్శనను నిషేధించారని వారు ఆవేదనతో తెలిపారు. గతంలో 15సంవత్సరాల క్రితం నెల్లూరు జిల్లాలో 560మందికి మాత్రమే వృద్ధకళాకారుల పెన్షన్ మంజూరు చేశారని, అనంతరం ఎంతగా మొరపెట్టుకున్నా 60సంవత్సరాలు దాటిన అర్హులు వందలాదిమంది ఉన్నా వారికి పెన్షన్ మంజూరు చేయలేదన్నారు. చింతామణినాటక ప్రదర్శనపై విధించిన నిషేధం రద్దుచేయాలని అరిచిగీపెట్టినా గత ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోనకుండా పెడచెవినపెట్టిందన్నారు. కళాకారులకు గుర్తింపుకార్డులంటూ దరఖాస్తున్న స్వీకరించిన గత ప్రభుత్వం కార్డులివ్వలేదన్నారు. వయసుమీరిన అర్హులైన కళాకారులకు పెన్షన్లు మంజూరుచేయాలన్నా జిల్లా పౌరసంబంధాల శాఖకు దరఖాస్తులు చేసే అవకాశం కూడా గత ప్రభుత్వం ఇవ్వలేదని వారు ఆవేదనతో తెలిపారు. గుర్తింపు కార్డులుంటే ఏదైనా ప్రదర్శనలకు వెళ్ళే సమయంలో ఎవరూ అడ్డుకొనకుండా ఉంటుందని భావించినా ఆకార్డులు ఇవ్వలేదన్నారు. ప్రదర్శనలకోసం వివిధ ప్రాంతాలకు ప్రయాణాలు చేయాల్సి ఉన్నందున ఆర్టీసీ బస్సుల్లో రాయితీ ఇవ్వాలని కూడా కోరినా పట్టించుకోలేదన్నారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా కళాకారుల వృత్తి ప్రాధాన్యతగా అర్హులందరికీ పెన్షన్లు మంజూరు చేయాలని, అందరు కళాకారులకు గుర్తింపు కార్డులివ్వాలని, ఆర్టీసీ బస్సుల్లో రాయితీ ఇవ్వాలని, కళాప్రదర్శనలే వృత్తిగా నమ్ముకొని సరైన అవకాశాలు లేక ఇబ్బందిపడుతున్నందున కళాకారుల ప్రదర్శనలకు దేవాలయాలు, ధార్మికసంస్థల్లో అవకాశం కల్పించాలని వారు నేటి ప్రభుత్వాన్ని కోరుతున్నారు. తాము ప్రజలమేనని, ఓటర్లమేనని, తాము కూడా ప్రజాప్రతినిధులను ఎన్నుకున్నామని, అన్నివర్గాల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలుచేస్తున్న ప్రభుత్వం కళాకారులను కూడా ఆదుకోవాలని, తమ సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని వారంతా కోరుతున్నారు.

### చేపల మార్కెట్లో లీగల్ మెట్రాలజీ తనిఖీలు

**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని జండా దిబ్బ రోడ్డులో గల చేపల మార్కెట్ నులీగల్ మెట్రాలజీ అధికారులు ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ శాఖ ఇన్స్పెక్టర్ షేక్ రియాజ్ భాషా మాట్లాడుతూ.. స్థానిక వినియోగదారులు పలువురు ఈ మార్కెట్లో తూకాలలో మోసం జరుగుతుందని ఫిర్యాదు చేయడంతో ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. వ్యాపారులు తమ కాటాలను సరైన సమయంలో తమ కార్యాలయానికి తీసుకొని వచ్చి, తగిన ఫీజులు చెల్లించి స్టాంపింగ్ చేయించుకోవాలన్నారు. ఈ తనిఖీల్లో ఈ మార్కెట్లోని కాటాల లోసుమారు 200 గ్రాముల నుండి 300 గ్రాముల వరకు వ్యాపారులు మోసం చేస్తున్నట్లు తెలుసుకున్నామన్నారు. అదేవిధంగా 15 కాటాలను సీజ్ చేస్తున్నట్లు ఇన్స్పెక్టర్ పేర్కొన్నారు. వినియోగదారులు కూడా తాము కొనుగోలు చేసేటప్పుడు కాటా జీరోలో ఉందో లేదో కూడా చూసుకోవాలన్నారు.

# జైలులో ఖైదీ మృతి

**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** సెంట్రల్ జైలు నెల్లూరులో ఖైదీ మృతి చెందిన ఘటనపై వి సత్రం పోలీస్ స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేశారు. విజయవాడకు చెందిన ఖైదీ మట్టి సుబ్బారావు (65) అనారోగ్యంతో జైలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఉండగా, పరిస్థితి విషమించడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఫిబ్రవరి 22 తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఉయ్యాల నరసింహారెడ్డి దేశభక్తి నేటి తరానికి స్ఫూర్తి

## జిల్లా రెవెన్యూ అధికారి విజయకుమార్



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** ఉయ్యాల నరసింహారెడ్డి 1846 ప్రాంతంలో జరిగిన ఉయ్యాలవారి ఉద్యమంలో విరోచితంగా పాల్గొని వారు చూపిన ధైర్య సాహసాలు విశేషమని వారి త్యాగస్ఫూర్తి, దేశభక్తి భావం నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని జిల్లా రెవెన్యూ అధికారి విజయకుమార్ పేర్కొన్నారు. ఆదివారం కలెక్టరేట్లోని ఎస్సార్ శంకరన్ వీడియోకాన్ఫరెన్స్ హాలు నందు యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో సైరా నరసింహారెడ్డి వర్ధంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. తొలుత వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించిన అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి విజయకుమార్ మాట్లాడుతూ.. ఉయ్యాల నరసింహారెడ్డి నవంబర్ 24, 1806న తండ్రి పెద్ద మల్లారెడ్డి తల్లి లక్ష్మమ్మ గారి దంపతులకు జన్మించారని, వారు ఫిబ్రవరి 22, 1847లో పరమపదించారన్నారు. వారు చూపిన దేశభక్తి పోరాటపటిమ బ్రిటిష్ వారిని ఎదిరించిన ధైర్య సాహసాలు గొప్పవని కొనియాడారు. వారికి సైన్యాధిపతిగా, నమ్మిన బంటుగా వడ్డెర ఓబన్న ఉండేవారన్నారు. నరసింహారెడ్డి జన్మస్థలం ఆంధ్రప్రదేశ్ లోని ఉయ్యాలవాడ గ్రామం అని తెలిపారు. ఈస్ట్ ఇండియా కంపెనీ వ్యతిరేకంగా పోరాడి 1847లో ఉరి బ్రిటిష్ వారిచే తీయబడ్డారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెట్నాల్ సీఈవో నాగేశ్వరరావు, మేనేజర్ శ్రీనివాస్ వర్మ, ప్రభుత్వ సంగీత కళాశాల నుంచి పినాకపాణి తదితరులు పాల్గొన్నారు.

# పొలాన్ని బాగు చేస్తుంటే అడుగడుగునా అడ్డంకులు



**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** తనకు ప్రభుత్వం ఇచ్చిన పొలాన్ని బాగు చేసుకుంటుంటే కొంతమంది అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని వరికుంటపాడు మండలం అశోక నగరం గ్రామానికి చెందిన సూరా సరస్వతి ఆవేదన వ్యక్తం చేశారు. అశోక నగరం గ్రామంలోని తనపొలం వద్ద ఆదివారం సాయంత్రం తనకు ప్రభుత్వం ఇచ్చిన పట్టాలు పాస్ పుస్తకాలు తదితర ఆధారాలతో మీడియాకు వెల్లడించారు. తాను మెట్ట పైర్లు వేసుకుంటుంటే పెట్టుబడులు రాక పంటలు సాగు చేయలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉప్పు వాగు సమీపంలో సర్వే నెంబర్ 46/7లో 1:20 సెంట్లు, సర్వే నెంబర్ 46/10లో 0.28 సెంట్లు 2006 సంవత్సరంలో తనకు పట్టా ఇచ్చారన్నారు. వాగులో పుష్కలంగా నీరు ఉండడంతో వరి పైరు పండించుకునేందుకు తన పొలంలో ఉన్నటువంటి మట్టి, రాళ్లను తొలగించి వరికి సాగు చేసుకునేందుకు సిద్ధం అవుతుండగా పలువురు తన పొలం వద్దకు వచ్చి ప్రభుత్వ భూమి అని అడ్డంకులు సృష్టించి, బెదిరిస్తున్నారని వాపోయింది. అధికారులు ఎవరు రావడం లేదు కానీ పలువురు విలేకరులమని చెప్పుకుంటూ తన పొలంలో ఉన్నటువంటి మట్టిని కూడా తొలగించనీకుండా అడ్డుపడుతున్నారన్నారు.

# ఇందుపూరు శ్రీనివాసులు రెడ్డి కుటుంబ సభ్యులకు ఎంపీ పరామర్శ



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, శ్రీ వేదగిరి నరసింహ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ ఇందుపూరు శ్రీనివాసులు రెడ్డి ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఆదివారం పొట్టేపాలెంలోని శ్రీనివాసులు రెడ్డి ఇంటికి వెళ్లిన ఎంపీ.. టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్ రెడ్డితో కలిసి ఇందుపూరు అత్యుచ్ రెడ్డి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. శ్రీనివాసులు రెడ్డి మృతి తీరని లోటని, అలాంటి వ్యక్తిని కోల్పోవటం వ్యక్తిగతంగా బాధాకరమన్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం శ్రీనివాసులు రెడ్డి చేసిన శ్రమ ఎనలేనిదని అన్నారు. ఎప్పుడు ఎలాంటి అవసరం ఉన్నా.. తాము అండగా ఉంటామని చెప్పారు. శ్రీనివాసులురెడ్డి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. కార్యక్రమంలో మేయర్ రూప్ కుమార్ యాదవ్, టిడిపి నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి, కేతంరెడ్డి వినోద్ రెడ్డి, దాట్ల చక్రవర్ధన్ రెడ్డి, గుడి హరి రెడ్డి, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రంగడి సన్నిధిలో గుడి-బడి కార్యక్రమం



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరులోని చారిత్రాత్మక తల్పగిరి రంగనాథ స్వామి ఆలయ సన్నిధిలో, ప్రణవ పీఠాధిపతి బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ శిష్య బృందం 'గుడి-బడి' కార్యక్రమంలో భాగంగా అద్భుతమైన సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 80 మంది శిష్యులు ఈ పవిత్ర కార్యంలో పాలుపంచుకుని, ఆలయ ప్రాంగణమంతా శుభ్రం చేశారు. ఈ స్వచ్ఛంద సేవలో భాగంగా రంగనాథుని ప్రధాన సన్నిధి, రంగనాయక అమ్మవారి ఆలయం, వెంకటేశ్వర స్వామి సన్నిధి, యజ్ఞశాల, అద్దాల మండపం, గోశాల, తిక్కన్న ప్రాంగణం, పెన్నా నది తీరంలోని దేవాలయ సముదాయం వంటి అన్ని ప్రాంతాలను అత్యంత భక్తిశ్రద్ధలతో శుద్ధి చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆళ్ళ శ్రీనివాసులు రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు, సిబ్బంది కూడా పాల్గొని శిష్య బృందం చేసిన సేవను అభినందించారు. భక్తిని, సామాజిక బాధ్యతను చాటిచెప్పేలా సాగిన ఈ కార్యక్రమం భక్తుల ప్రశంసలు అందుకుంది.

## రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** శ్రీ తల్పగిరి రంగనాథ స్వామివారి బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 26వ తేదీన అంకురార్పణతో ప్రారంభమై మార్చి 8వ తేదీ వరకు వైభవంగా జరుగుతాయి. ఫిబ్రవరి 27న ధ్వజారోహణం, శేషవాహన సేవతో మొదలై, ప్రతిరోజూ ఉదయం, రాత్రి వేళల్లో సూర్యప్రభ, హంస, సింహ, చంద్రప్రభ, హనుమంత, గజవాహన సేవలు నిర్వహించబడతాయి. ఉత్సవాల్లో ముఖ్య ఘట్టాలైన బంగారు గరుడ సేవ మార్చి 3న, శ్రీవారి కల్యాణోత్సవం మార్చి 4న, మహారథోత్సవం మార్చి 5న భక్తుల సమక్షంలో జరగనున్నాయి. మార్చి 6న తెప్పోత్సవం, మార్చి 7న చక్రస్నానం, మార్చి 8న పుష్పయాగం, ధ్వజావరోహణంతో ఈ ఉత్సవాలు ముగుస్తాయి.

## వీఆర్వోకు సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి



**రాపూరు, మేజర్‌న్యూస్ :** జిల్లా రెవిన్యూ శాఖలో భారీగా వీఆర్వోలకు పదోన్నతులు కల్పించారు. ఆదివారం జిల్లా కలెక్టర్ ఒకేసారి 18 మంది వీఆర్వోలకు సీనియర్ సహాయకులుగా పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో రాపూరు మండలంలోని సంక్రాంతిపల్లి గ్రామరెవెన్యూ అధికారిగా పనిచేస్తున్న ఏటూరు మదన్ మోహన్‌రెడ్డికి సీనియర్ సహాయకులుగా పదోన్నతి లభించింది. వీఆర్వోగా పనిచేస్తున్న ఏటూరు మదన్ మోహన్ రెడ్డికి పదోన్నతి కల్పిస్తూ చేజర్ల మండలం సీనియర్ సహాయకులుగా బదిలీ చేశారు. ఈ మేరకు రాపూరు మండల తహసీల్దార్ కార్యాలయంకు ఉత్తర్వులు అందాయి. పదోన్నతి పొందిన మదన్ మోహన్ రెడ్డి ఆదివారం జిల్లా కలెక్టర్ నుండి ఉత్తర్వులు అందుకున్నారు.

## మూలస్థానేశ్వరునికి ఏకాంతసేవ



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని చారిత్రాత్మక మూలాపేట శ్రీ భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వర స్వామి వారి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారికి ఏకాంత సేవను కనులపండువగా నిర్వహించారు. ఈ విశేష వేడుకను వీక్షించేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. దేవస్థాన పాలక మండలి చైర్మన్ పుట్టా విజయ్ కుమార్‌రెడ్డి, సభ్యులు, కార్యనిర్వహణాధికారి ఆర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి, ఆలయ సిబ్బంది సమక్షంలో ఈ కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. వేడుక అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. భక్తిశ్రద్ధలతో సాగిన ఈ ఏకాంత సేవతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లింది.

## రాష్ట్రస్థాయి రెజ్లింగ్‌లో అమర్‌కు కాంస్యపతకం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలలో బట్టేపాడు హైస్కూలు విద్యార్థి షేక్ అమర్ ప్రతిభ చూపి కాంస్యపతకం కైవసం చేసుకున్నాడు. చిత్తూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి అమెచ్చూర్‌రెజ్లింగ్ పోటీల్లో అండర్15 గ్రికోరోమన్ విభాగంలో అమర్ అత్యంత ప్రతిభ చూపాడు. ఆయన చూపిన ప్రతిభ బట్టేపాడుకు గౌరవం లభించింది, అమర్‌ను ఆత్మకూరు పట్టణబిజెపి అధ్యక్షుడు నున్నా సంతోష్‌కుమార్ సన్మానించి అభినందనలు తెలిపారు. ఆ విద్యార్థికి తర్ఫీదునిచ్చిన పి.డి కావాటి వెంకటకృష్ణను కూడా సన్మానించి అభినందించారు. ఆ విద్యార్థిని, పిడిని గ్రామస్థులు అభినందించి భవిష్యత్తులో మరిన్ని పతకాలు పొందాలని ఆకాంక్షించారు.